వాహనాల వేలం

మేడ్చల్: పలు కేసుల్లో మేడ్చల్ ఎక్సైజ్ పోలీసులు సీజ్ చేసిన వాహనాలను వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ నవనీత తెలిపారు.ఈనెల 16న మేడ్చల్ ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో మూడు ద్విచక్రవాహనాలు వేలం వేస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు స్టేషన్ లో సంప్రదించి వేలంలో పాల్గొనాలని కోరారు.

మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసిన మాజీ మేయర్ కావ్య



జవహర్‌నగర్: ఎర్రవల్లి ఫాంహౌస్‌లో మాజీ సీఎం కేసీఆర్‌ను శుక్రవారం ఎమ్మెల్యే మల్లారెడ్డి సమక్షంలో జవహర్ నగర్ మాజీ మేయర్ కావ్య కలిశారు. జవహర్‌నగర్ కార్పొరేషన్‌ను మాజీ సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే మల్లారెడ్డి సహకారంతో ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. కేసీఆర్ సారథ్యంలో మరోసారి తెలంగాణలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న దృశ్యం

కీసర: కీసర మండలం పరిధిలోని నాగారంలోని సర్వే నెంబర్-83లో ప్రభుత్వ భూమిలో నిర్మించిన అక్రమ నిర్మాణాలను శుక్రవారం తహసీల్దార్ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో కూల్చివేశారు. ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలను చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

శానిటరీ ప్యాడ్స్ అందజేత



శానిటరి ప్యాడ్స్ అందజేస్తున్న మహిళా కాంగ్రెస్ నేతలు

మేడ్చల్: ఆరోగ్య పరిరక్షణలో భాగంగా జాతీయ మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో చదివే ఆడపిల్లలకు ఉచితంగా శానిటరి ప్యాడ్స్ అందజేస్తున్నట్లు జిల్లా మహిళా కాంగ్రెస్ కార్యదర్శి మరిలు తెలిపారు. గౌడవెల్లి ఉన్నత పాఠశాల విద్యార్థినులకు శుక్రవారం గుండ్లపోచంపల్లి మున్సిపల్ మహిళా కాంగ్రెస్ నేతలతో కలిసి శానిటరి ప్యాడ్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆల్కలంబ నేతృత్వంలో దేశ వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఆడపిల్లలకు ప్యాడ్స్ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమంలో గుండ్లపోచంపల్లి అధ్యక్షురాలు ఆదిలక్ష్మి, నాయకురాళ్లు స్వప్న, అశ్విని, కమలమ్మ పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

పోచారం: గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందిన ఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. ఇన్‌స్పెక్టర్ రాజు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. జార్ఖండ్‌కు చెందిన బబ్లు కుమార్ యాదవ్ (19) అన్నోజిగూడలో నివసిస్తూ ఆటో నడుపుతున్నాడు. శుక్రవారం తులిప్స్ హోటల్ వద్ద జాతీయ రహదారిపై అతివేగంగా వచ్చిన గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో బబ్లు కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ ఢీకొని వ్యక్తి మృతి

పోచారం: బైకు ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రాజు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అన్నోజిగూడలోని ప్రకాష్‌నగర్ కాలనీకి చెందిన బుక్క సముద్రం చంద్రారెడ్డి (57) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం అతను అన్నోజిగూడలోని ప్రధాన రహదారిపై ఎలక్ట్రికల్ సామాగ్రి కొనుగోలు చేసి స్కూటీపై వస్తున్నాడు. అదే సమయంలో ఘట్‌కేసర్ నుంచి ఉప్పల్ వైపు అతివేగంగా వచ్చిన బైకు ఢీకొట్టింది. ఈ ఘటనలో చంద్రారెడ్డి తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

మల్లాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నేత నెమలి అనిల్‌కుమార్ అన్నారు. గతంలో ఓల్డ్ మల్లాపూర్‌లోని ఎస్సీబస్తీలో బస్తీబాట కార్యక్రమంలో తమ దృష్టికి వచ్చిన డ్రైనేజీ సమస్యను ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డికి తీసుకువెళ్లగా సంబంధిత అధికారులతో మాట్లాడి పనులను ప్రారంభించారు, శుక్రవారం డ్రైనేజీ పనులను అనిల్‌కుమార్ పరిశీలించారు.

ప్రకటించి ఆరేళ్లు.. అమలుకు ఎన్నేళ్లు..?

మధ్యాహ్న భోజనానికి నోచుకోని ఇంటర్ విద్యార్థులు

- అర్ధాకలితో విద్యార్థులకు తప్పని ఇబ్బందులు
- శివారు మేడ్చల్ జిల్లాలో 4ప్రభుత్వ, 2 ఎయిడెడ్ కాలేజీలు 2,650 మంది విద్యార్థులు



సాక్షి,మేడ్చల్ జిల్లా: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పోషకాహారం అందించాలన్న ఉద్దేశంతో గత ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించినప్పటికీ నేటికీ పథకం అమలుకు నోచుకోకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్న భోజనం పథకం అమలైతే.. నగర శివార్లలోని వివిధ ప్రాంతాల నుంచి మండల కేంద్రాలకు చదువుకునేందుకు వెళ్లే ఇంటర్ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరం ఉండనుంది. ఇది కార్యరూపం దాల్చకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్నభోజనం అమలు చేస్తామని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆరేళ్ల క్రితం ప్రకటించింది. ఇప్పటికీ పట్టాలెక్కకపోవడంతో జిల్లాలోని విద్యార్థులు నష్టపోతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు పరిచే విషయంపై శ్రద్ధ చూపాలని వారి తల్లిదండ్రులు ,విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి. నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో నాలుగు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా, రెండు ఎయిడెడ్ కాలేజీలు ఉన్నాయి. ఈ కాలేజీల్లో 2,650 మంది విద్యార్థులు చదువుతున్నారు. షిఫ్టు సిస్టమ్‌లో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కళాశాల తరగతులు నిర్వహిస్తున్నారు. శివారు ప్రాంతాల్లోని చాలా మంది విద్యార్థుల తల్లిదండ్రులు దినసరి కూలీ పనులతో పాటు వివిధ పరిశ్రమల్లో అసంఘటిత కార్మికులుగా పని చేస్తున్నారు. మల్కాజిగిరి, కూకట్‌పల్లి, కత్బుల్లాపూర్, మేడ్చల్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నప్పటికిని, అవి షిఫ్టు సిస్టమ్‌లో నడుస్తున్నాయి. ఉదయం ఇంటర్ తరగతులను నిర్వహిస్తుండగా, మధ్యాహ్నం తర్వాత డిగ్రీ కళాశాలల తరగతులు కొనసాగుతున్నాయి. బొల్లారం, అల్వాల్ ప్రాంతాల్లో ప్రభుత్వ ఎయిడెడ్ కళాశాలలు ఉన్నాయి. ప్రతిరోజు షిఫ్టు సిస్టమ్‌లో ఇంటర్ తరగతులు కొనసాగుతుండటంతో... ఇందులో చదువుతున్న విద్యార్థులు ఉదయాన్నే కాలేజీలకు రావాల్సి వస్తోంది.దీంతో ఉదయం పూట ఇంట్లో భోజనం తయారు కాక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఫలితంగా కళాశాలలకు వెళ్తున్న ఇంటర్ విద్యార్థులు అర్ధాకలితో అలమటించాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. ఆకలి కారణంగా అధ్యాపకులు బోధిస్తున్న పాఠాలు విద్యార్థులకు అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే ఇంటర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రుల, విద్యార్థి సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు. ఈ విషయమై జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి కిషన్ మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. అనుమతి రాగానే అమలుకు చర్యలు తీసుకుంటామన్నారు.

వేద బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి



వేద విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న మాజీ మంత్రి హరీష్‌రావు

శామీర్‌పేట్: వేద బ్రాహ్మణులకు తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు అన్నారు. శుక్రవారం తూంకుంట మున్సిపల్ కేంద్రంలోని రామభద్ర క్షేత్రంలో తెలంగాణ వేద శాస్త్ర ప్రవర్ధక సభ ఆధ్వర్యంలో 9వ చతుర్వేద సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద విద్యార్థులకు పరీక్షలు నిర్వహించగా పలు రాష్ట్రాల నుంచి సుమారు 500 మంది వేద విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణులైన వేద విద్యార్థులకు మాజీ మంత్రి హరీష్‌రావు చేతుల మీదుగా పట్టాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అంత సులువు కాదని, తెలంగాణలోని వేద పాఠశాలల్లో చదివిన పిల్లలు మనదగ్గరే పరీక్షలు రాయాలని నిర్వహించడం శుభ పరిణామమన్నారు. ప్రభుత్వ పరంగా గుర్తింపు వస్తే వేద విద్యార్థులకు మంచి ఉద్యోగాలు వస్తాయని, తెలంగాణలో వేద పాఠశాల విద్యార్థులకు తన వంతు కృషి చేస్తానన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలకు తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ఆదర్శంగా నిలుస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాల వల్ల బ్రాహ్మణ సంఘాలకు నిధులు మంజూరు అవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం రామభద్రక్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వేద బ్రాహ్మణలు, నిర్వాహకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చేయూతనివ్వాలి



నోట్ బుక్స్ అందజేస్తున్న రోటరీ క్లబ్ అధ్యక్షురాలు నీరజ

శామీర్‌పేట్: ప్రభుత్వ పాఠశాలలో చదివే విదార్థులకు ప్రతి ఒక్కరు చేయూతనివ్వాలని రోటరీ క్లబ్ అధ్యక్షురాలు గోదావర్తి నీరజ, జిల్లా ఆర్టీఏ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తూంకుంట మున్సిపాలిటీ, దేవరయాంజాల్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విద్యా సామగ్రితో పాటు నోట్ పుస్తకాలు, స్టేషనరీ, బిస్కెట్లు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ... ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు కావాల్సిన మౌలిక వసతులను కల్పించడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కల్యాణి, రోటరీ క్లబ్ సభ్యులు యశోద, సెయింట్ పీటర్ ఇంజనీరింగ్ కళాశాల డైరక్టర్ సరోజ, శ్రీసీతారామచంద్ర స్వామి దేవాలయ చైర్మన్ పెండెం లక్ష్మీ నారాయణ, ఉపాధ్యాయులు. విద్యార్థులు పాల్గొన్నారు.

సృజనాత్మకంగా ఆలోచించాలి



సదస్సులో మాట్లాడుతున్న సైంటిస్ట్ అనిమా జోహారి

పోచారం: విద్యార్థుల సృజనాత్మక ఆలోచనల నుండి పరిశోధనలు రావాలని సర్దార్ పటేల్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డా. లలిత్ కుమార్ అవస్థి అన్నారు. గత రెండు రోజులుగా యంనంపేట్‌లోని శ్రీనిధి ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్ అండ్ టెక్నాలజీలో భారత ప్రభుత్వ రంగ సంస్థ అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'కృత్రిమ మేధ వినియోగంతో రాబోయే తరంలో సాంకేతికతలు' అనే అంశంపై జరుగుతున్న జాతీయ సదస్సు శుక్రవారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ పరిశోధనలు సమాజానికి ఎంతో అవసరమన్నారు. కృత్రిమ మేధ (ఏఐ) రూపాంతర శక్తితో అద్భుతాలు సృష్టించవచ్చన్నారు. యాభై ఏళ్లలో జరిగే ప్రగతిని ఏఐతో రెండేళ్లలో సాధించవచ్చన్నారు. ఇంజినీరింగ్ విద్యార్థులు ఏఐపై దృష్టి సారించాలన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న అనుసంధాన్ సైంటిస్ట్ డాక్టర్ అనిమా జోహారి మాట్లాడుతూ.. కృత్రిమ మేధపై జరిగిన సదస్సు భవిష్యత్తును నిర్మించే విశిష్ట వేదికగా పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా సదస్సుకు 172 పరిశోధన పత్రాలు అందాయి. సమీక్ష తర్వాత 109 పత్రాలు ప్రొసీడింగ్స్‌లో ఉన్నాయి. పీర్ రివ్యూ తర్వాత 52 ఉత్తమ పత్రాలు తుది ప్రెజెంటేషన్‌కు ఎంపికయ్యాయి. కార్యక్రమంలో శ్రీనిధి యూనివర్సిటీ ప్రో చాన్సలర్ డా.పి.నర్సింహారెడ్డి, స్నిస్ట్ ప్రిన్సిపాల్ డా. శివారెడ్డి, పరిశోధనా విభాగం సలహాదారు డా.సంజీవరావు, డీన్ డా.అలీ హుస్సేన్, సీఎస్ఈ హెచ్ఓడీ డా. కే.శిరీష, కన్వీనర్లు డా.అరుణ వారణాసి, డా.తాళకోటి మమత, కోకన్వీనర్ డా. బాలాజీ పాల్గొన్నారు.

వీధి కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు



శామీర్‌పేట్: తూంకుంట మున్సిపల్ కార్యాలయం వద్ద శుక్రవారం బ్లూ క్రాస్ హైదరాబాద్ సహకారంతో యాంటీ రేబిస్ టీకా క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ జ్యోతి మాట్లాడుతూ యాంటీ రేబిస్ టీకా మొబైల్ క్యాంపులను మున్సిపల్ పరిధిలోని వార్డుల్లోనూ నిర్వహించినట్లు తెలిపారు. మున్సిపల్ పరిధిలోని ప్రజలు తమ పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఆర్టీఏ మెంబర్ జైపాల్ రెడ్డి, బ్లూ క్రాస్ హైదరాబాద్ మెంబర్ కుమారి పాల్గొన్నారు.

యాదవులకు స్థలం కేటాయించాలి

అల్వాల్/మల్కాజిగిరి: కుల వృత్తిని కొనసాగిస్తున్న యాదవులకు ప్రభుత్వం స్థలాన్ని కేటాయించాలని నేరెడ్‌మెట్ యాదవ సంఘం ప్రధాన కార్యదర్శి పూలపల్లి సుందర్ యాదవ్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం మల్కాజిగిరి మండల డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. సుందర్ యాదవ్ మాట్లాడుతూ ఓల్డ్ నేరెడ్‌మెట్ ప్రాంతంలో సుమారు 213 యాదవ కుటుంబాలు పాల వ్యాపారం చేస్తున్నారన్నారు. ఇంటి వద్ద తగిన స్థలం లేకపోవడంతో బయట గోవులను, గేదెలను కట్టివేయడం వలన ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రజకులకు దోబీఘాట్ కోసం స్థలాన్ని ప్రభుత్వం కేటాయిస్తున్నాదని అదే తరహాలో యాదవులకు పశువుల కొట్టాల ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించాలన్నారు.

ముందస్తు సమాచారం ఇవ్వండి



ఏడీఈకి వినతిపత్రం అందజేస్తున్న కేబుల్ ఆపరేటర్లు

మేడ్చల్: ముందస్తు సమాచారం ఇవ్వకుండా కేబుల్ వైర్లను తొలగించవద్దంటూ శుక్రవారం మేడ్చల్ ఏడీఈ కి మేడ్చల్ మండల కేబుల్ ఆపరేటర్లు శుక్రవార వినతిపత్రం అందజేశారు. కేబుల్ వైర్లను తొలగించడం వల్ల తాము తీవ్రంగా నష్టపోతున్నామని, సమాచారం ఇస్తే తామే తొలగిస్తామన్నారు. ఈ సందర్భంగా విద్యుత్ ఏడీఈ కేబుల్ ఆపరేట్లకు పలు సూచనలు చేశారు. కేబుల్ వైర్ల మరమ్మలు చేసేటప్పుడు విద్యుత్ అధికారులకు ముందస్తు సమాచారం ఇవ్వాలని, ప్రమాదాలు చోటుచేసుకోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కేబుల్ ఆపరేటర్లు, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ బాలస్వామి

ఘట్‌కేసర్: మిలాన్ ఉన్‌నబీ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని ఇన్‌స్పెక్టర్ బాలస్వామి అన్నారు. మిలాన్ ఉన్‌నబీ పండుగ నిర్వహణపై కుల, మత పెద్దలతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో పీఎస్ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ పండుగ నిర్వహించేవారు సామరస్య వాతావరణం కల్పించాలన్నారు. ఇతరుల పండుగల సమయంలో గౌరవించి సహకరించాలని సూచించారు. ఎస్సైలు ప్రభాకర్‌రెడ్డి, హీనా, నాయకులు పాల్గొన్నారు.

గర్భిణులకు సమగ్ర సేవలు అందించాలి

సాక్షి,మేడ్చల్ జిల్లా: ప్రతి గర్భిణికి ప్రాథమిక స్థాయిలో నుంచే సమగ్ర సేవలు అందించాల్సిన బాధ్యత వైద్య, ఆరోగ్య సిబ్బందిపై ఉందని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా.ఉమాగౌరి అన్నారు. శుక్రవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో జిల్లాలో నమోదైన మాతా మరణాలపై ఆమె సమగ్రంగా చర్చించారు. ఏప్రిల్, మే నెలల్లో పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో తల్లుల మరణాలు చోటు చేసుకోవడంపై ఆరా తీశారు.సమావేశంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు,సూపర్‌వైజర్లు, మహిళా ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ ఉమాగౌరీ మాట్లాడుతూ హైరిస్క్ గర్భిణీ స్త్రీలలో సంభవించే రక్తహీనత, హైబీపీ, ఇతర ఆరోగ్య సమస్యలు ఏమైనా ఉన్నట్లయితే ప్రాథమిక స్థాయిలోనే గుర్తించి,నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి మొదటి కాన్పును హైరిస్క్ కేసుగానే గుర్తించి బర్త్ ప్లానింగ్ చేయాలని వైద్యులకు సూచించారు. సమయానికి రిఫెరల్ చేయడం, ఎమర్జెన్సీ ట్రాన్స్‌పోర్ట్ సౌకర్యం వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని వైద్యులను ఆదేశించారు. భవిష్యత్తులో మాత మరణాలు జరగకుండా జిల్లాలో అన్ని స్థాయిల వైద్యాధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. జిల్లా డిప్యూటీ డి.ఎంహెచ్‌ఓలు డాక్టర్లు సత్యవతి, గీత, ప్రోగ్రాం అధికారులు డాక్టర్లు మల్లీశ్వరి, స్వర్ణలత, గైనకాలజిస్ట్ సంబంధిత ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, మహిళ ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫేస్ రికగ్నైజేషన్ సిస్టమ్ అప్‌డేట్ చేయండి

ప్రిన్సిపాళ్ల సమావేశంలో అదనపు కలెక్టర్ రాధికా గుప్తా



సాక్షి,మేడ్చల్ జిల్లా: ఎస్సీ,ఎస్టీ ఇంటర్ విద్యార్థుల డిజిటల్ కీ ఫర్ స్కాలర్‌షిప్ ఆన్‌లైన్‌లో ఫేస్ రికగ్నైజేషన్ సిస్టమ్ అప్‌డేట్ చేస్తేనే జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ పోర్టల్‌లోకి వస్తుందని, ఈ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని జూనియర్ కళాశాల ప్రిన్సిపాళ్లను మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధికగుప్తా ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులు ,ప్రిన్సిపాళ్లతో ఆమె సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.జిల్లాలో మండలాల వారీగా ప్రతి కాలేజీలో పెండింగ్‌పై ఎదురవుతున్న కారణాలను అదనపు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన డిజిటల్ థీమ్ ప్రక్రియను విజయవంతం చేయాలని సూచించారు. వారం రోజుల్లో పోర్టల్‌లో నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. కొన్ని కాలేజీల్లో ఎక్కువ శాతం పెండింగ్ ఉండటానికి వలన విద్యార్థుల హాజరు శాతం తక్కువగా ఉండడమేనని ప్రిన్సిపాళ్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో ఇన్ యాక్టివేట్ నుంచి యాక్టివేట్ చేయడంలో, డ్రా బాక్స్‌కు పంపడంలో, ఎస్ఎస్‌సీ మెమో ప్రకారం ఆధార్‌లో వివరాలు లేకపోవడం వల్ల కొంత జాప్యం జరుగుతుందని అదనపు కలెక్టర్ దష్టికి ప్రిన్సిపాళ్లు తీసుకు వచ్చారు. ఆన్‌లైన్‌లో సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని అదనపు కలెక్టర్ రాధికా గుప్తా తెలిపారు. కాలేజీలలో ఉత్తీర్ణత శాతాన్ని 80 శాతానికి తగ్గకుండా పెంచడంతోపాటు అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జూనియర్ కాలేజీల్లో అవసరమైన తాగునీరు, లైటింగ్, ఫ్యాన్లు డ్రైనేజీ, వాటర్ లీకింగ్, విండోస్ వంటి సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే.. తప్పనిసరిగా పరిష్కరిస్తామన్నారు. సమావేశంలోజిల్లా ఇంటర్మీడియెట్ అధికారి కిషన్, జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి వినోద్ కుమార్, ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

రుణమాఫీ కోసం రిలే నిరాహార దీక్ష



ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ రైతు సేవా సహకార సంఘంలో తీసుకున్న అన్నదాతలు రుణం మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ రుణమాఫీ సాధన సమితి అధ్యక్షుడు గౌరీశంకర్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్ష శుక్రవారం మూడో రోజుకు చేరుకుంది. గౌరీశంకర్, శివకుమార్, నర్సింహ్మా, రాములు, సత్యనారాయణ, ఆనంద్ దీక్ష చేపట్టగా లక్ష్మారెడ్డి, ప్రవీణ్‌కుమార్, శోభారాణి, మహిపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ధర్మారెడ్డి, జైపాల్‌రెడ్డి, పాండరిముదిరాజ్, అంజయ్య, మమతశర్మ, ఇతర రైతులు పాల్గొన్నారు.

కల్లు కంపౌండ్ నిర్వాహకులతో సీఐ సమావేశం



కల్లు కంపౌడ్ నిర్వాహకులతో సమావేశమైన శామీర్‌పేట పోలీసులు

శామీర్‌పేట్: శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని కల్లు కంపౌండ్ నిర్వాహకులతో శామీర్ పేట్ పోలీస్ స్టేషన్‌లో సీఐ శ్రీనాథ్ శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కల్లు కంపౌండ్లలో తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై చర్చించారు. ప్రతి కంపౌండ్‌లో తప్పనిసరిగా సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, చట్టానికి లోబడి సక్రమంగా నిర్వహించుకోవాలని ఆదేశించారు. నిర్వాహకులకు నోటీసులు జారీ చేసి, పై సూచనలను తప్పనిసరిగా పాటించాలన్నారు శాంతి భద్రతలను కాపాడడంలో పోలీసులు ఎల్లప్పుడూ ప్రజలతో కలిసి పనిచేస్తారని, ప్రజల సహకారంతో మరింత సురక్షిత వాతావరణం నెలకొల్పుతామని తెలిపారు. సమావేశంలో ఎస్సైలు శశివర్ధన్‌రెడ్డి, దశరథ్, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలతోనే ప్రమాదాల నియంత్రణ



రాజీవ్ రహదారిని పరిశీలిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి

శామీర్‌పేట్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి అన్నారు. శామీర్‌పేట్ పరిధిలోని హైదరాబాద్ - కరీంనగర్ రాజీవ్ రహదారిపై జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం ఆయన ప్రమాద కేంద్రాలను సందర్శించారు. వాహనదారులు సహకరిస్తేనే రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చని, రాజీవ్ రహదారిపై జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. వాహనదారులు జాగ్రత్తగా వాహనాలు నడపాలన్నారు. కార్యక్రమంలో శామీర్‌పేట్ సీఐ శ్రీనాథ్, మేడ్చల్ ట్రాఫిక్ సిఐ మధుసూదన్, తూంకుట మున్సిపల్ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మెరుగైన వసతుల కల్పనకు కృషి



వివరాలు అడిగి తెలుసుకుంటున్న విద్యా కమిషన్ సభ్యురాలు కందాడి జ్యోత్స్న

కీసర: తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యురాలు కందాడి జ్యోత్స్న శివారెడ్డి శుక్రవారం కీసర జెడ్పీహెచ్ఎస్, ఎంపీపీఎస్ స్కూల్‌లను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని వంటగది, తరగతి గదులను, పౌష్టిక ఆహార సదుపాయాలను తనిఖీ చేసి పాఠశాలలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించడానికి కృషి చేస్తామన్నారు. విద్యార్థులు కృషి, పట్టుదలతో చదివి మంచి ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రామ్‌రెడ్డి, కందాడి హన్మంత్‌రెడ్డి, జూపల్లి సురేందర్, యాదగిరి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా డా. కేవీ రావు సైంటిఫిక్ సొసైటీ వార్షికోత్సవం



సాక్షి, సిటీబ్యూరో: డా. కేవీ రావు సైంటిఫిక్ సొసైటీ (కే వీ ఆర్ ఎస్ ఎస్) 25వ వార్షికోత్సవాన్ని సీ ఎస్ ఐ ఆర్ - సీ సీ ఎం బీ హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా ప్రముఖ శాస్త్రవేత్తలు తమ అనుభవాలను పంచుకున్నారు. ఐ ఐ ఎస్ సీ ప్రొఫెసర్ జీ. మాధవి లత చీనాబ్ బ్రిడ్జ్ ప్రాజెక్ట్‌లో జియోటెక్నికల్ కన్సల్టెంట్‌గా చేసిన సేవలను వివరిస్తూ, 'ఇచ్చినదాని కంటే నేర్చుకున్నది ఎక్కువ' అన్నారు. హిమాలయ భూభాగం ఎప్పటికప్పుడు కొత్త సవాళ్లు విసిరిందని.. బీటలు వేసిన రాళ్లు, గుహలు, షియర్ జోన్లు, ఇక్కడ సొల్యూషన్లు పుస్తకాల్లోనూ, కోడ్‌ల్లోనూ దొరకలేదు. ప్రాంగణంలోనే కొత్త పద్ధతులను ఆవిష్కరించి, పరీక్షించి, అమలు చేయాల్సి వచ్చిందని గుర్తు చేసుకున్నారు. ప్రధాన అతిథి సీ ఎస్ ఐ ఆర్ - సీ సీ ఎం బీ డైరెక్టర్ డా. వినయ్ కే. నందికూరి.. విద్యార్థులు సైన్స్‌ను కెరీర్‌గా ఎంచుకోవాలని సూచించారు. సొసైటీ 25 ఏళ్లలో 75,000 మంది విద్యార్థులు, 250 పరిశోధనా సంస్థలపై ప్రభావం చూపినట్లు కార్యదర్శి డా. రత్న తెలిపారు.

- భారతదేశం ఆర్ అండ్ డీ ఖర్చులో ప్రపంచ దేశాలతో పోలిస్తే వెనుకబడి ఉందని అధ్యక్షుడు డా. అనిల్ కుమార్ కుట్టి వివరించారు. భవిష్యత్తులో అత్యాధునిక సైన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు సొసైటీ ప్రకటించింది. ఇప్పటికే 2021 నుంచి సైన్స్ ఇన్నోవేషన్ సెంటర్, మొబైల్ సైన్స్ ల్యాబ్ ద్వారా 20,000 పైగా విద్యార్థులను చేరుకుంది. ఈ కార్యక్రమంలో భాగంగా 4000 చదరపు అడుగుల్లో రూ.2 కోట్ల విలువైన ఇల్లు విరాళంగా లభించింది.